క్లుప్తంగా

వరి పంట పరిశీలన



పద్ద గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: వర్షాలు లేక ఎండిపోయిన వరి పంటకు పరిహారాలను అందించే దిశగా కృషిచే స్తామని వ్యవసాయ పథక సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి దానకర్ణుడుతో కలిసి సుందరాడ, చింతపల్లి, ముకుందాపురం, కుర్మన్నపేట పద్ద గ్రామాలలో మంగళవారం పర్యటించి, ఎండిపోయిన వరి పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో నష్టపోయిన పంటను అంచనా వేసి నివేదికను పైఅధికారులకు అందజేస్తామన్నారు. నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని, ఆందోళన చెందవద్దన్నారు. తహసీల్దార్ సరోజిని, వీఆర్వో శ్యామ్యూల్ పలువురు రైతులు పాల్గొన్నారు.

జీసీ హోమ్ సేవలపై ఆరా



జీసీ హోమ్ వద్ద తనిఖీ బృందం

నరసన్నపేట: స్థానిక గోఖిలే శిశు సదనం (జీసీ హోమ్)లో విద్యార్థులకు అందుతున్న సేవలపై బాలల, వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకులు బీవీ రవికుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆరా తీశారు. మంగళవారం ఉదయం రవికుమార్ అధ్యక్షతన కమిటీ ప్రతినిధులు ఎం.మల్లేశ్వరరావు, ఎం.గన్నెప్పుడు, టి.లక్ష్మణరావు, కౌన్సిలర్ డి.సీతారాములు, సోషల్ వర్కర్ డి.మధురమీనాక్షి సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాల పట్ల హోమ్ వార్డెన్ రవీంద్రనాథ్ సాహు, లోకల్ కమిటీ చైర్మన్ సదాశివుని కృష్ణ నుంచి వివరాలు సేకరించారు.

జగనన్న కాలనీలో బోరు ఏర్పాటు



జగనన్న కాలనీలో బోరు తవ్వుతున్న దృశ్యం

సారవకోట: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో మంగళవారం బోరు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఇక్కడ 30 మంది లబ్ధిదారులకు స్థలాలు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకునే వారికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా బోరు ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పనులను స్థానిక సర్పంచ్ శంకరబాబు, ఎంపీటీసీ గుణుపురం రామారావు పర్యవేక్షించారు.

నియామకపత్రం అందజేత



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మెళియాపుట్టి మండలంలోని కొసమాల-1 అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసేందుకు సహాయకురాలిగా కె.యామిని ఎంపికయ్యారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ విమలరాణి సమక్షంలో యామినికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం నియామక పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జయమునిరావు, పనుకు మోహన్, శశిభూషణరావు, సుపర్‌వైజర్ ప్రియవధ పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



సంఘటన స్థలంలో ఉన్న కారు

పాతపట్నం: హిరమండలం మండలంలోని ధనుపురం గ్రామ సమీపంలో గల నీలమణి దుర్గ ఆలయం పక్కన ఉన్న కాలువలోకి ఒడిశాకు చెందిన కారు దూసుకెళ్లింది. కారులో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ఆటోలో పర్లాకిమిడికి తరలించారు.

పులి తిరుగుతోంది జాగ్రత్త!

మెళియాపుట్టి: పులి సంచరిస్తోందని ఫారెస్ట్ అధికారులు స్థానిక తహసీల్దార్‌కు తెలియజేశారు. దీంతో మండలంలోని పరశురాంపురం సచివాలయంపరిధిలోని గ్రామాలైన, చీపురుపల్లి, హీరాపురం, రాయికోల, హీరాపురం, తూముకొండ, నందవ, తోవూరు పెద్దమడి తదితర గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు, సిబ్బంది మంగళవారం సాయంత్రం అప్రమత్తం చేశారు. పలాస, మెళియాపుట్టి మండలాల సరిహద్దు గ్రామాల్లోని పంట పొలాల్లో పులి పాదముద్రలు రైతులు గుర్తించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో బయటికి రావొద్దని సూచనలు చేశారు.



బహిరంగ సభకు హాజరైన జనసందోహం



బహిరంగ సభ వెనక భాగంలో నిలబడి ప్రసంగాన్ని ఆలకిస్తున్న ప్రజలు

ప్రభంజనమై..



ప్రసంగాలను ఆసక్తిగా వింటున్న మహిళలు



వర్షం పడుతుండటంతో వాకలవలస సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద వేచివున్న పార్టీ అభిమానులు

జనం.. ఎటు చూసినా జనం. ఏ వైపు చూపు తిప్పినా అభిమాన గణం. ఉవ్వెత్తున ఎగసి పడిన ఈ జన కెరటం ప్రభంజనమై ఆమదాలవలసను తాకింది. వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సామాజిక సాధికార యాత్రను సుసంపన్నం చేసింది. నాలుగున్నరేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ చేసిన మేలును తలచుకుని బడుగు వర్గాలన్నీ నాయకుల వెనుకే అడుగులు వేశాయి. తమ క్షేమాన్ని కోరి సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలను మెచ్చుకుంటూ నేతలకు మనసారా కృతజ్ఞతలు చెప్పాయి. ఆమదాలవలసలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఆ నియోజకవర్గ చరిత్రలో ఓ కొత్త అధ్యాయాన్ని లిఖించింది.



బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు, ఎమ్మెల్యేలు



బూర్జ నుంచి బస్సు యాత్రకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



ఆమదాలవలస మండలం బెలమాం నుంచి బస్సు యాత్రకు బయలుదేరిన ప్రజలు



ఆమదాలవలస మండలం రామచంద్రాపురం నుంచి బస్సు యాత్ర కోసం సిద్ధం చేసిన ఆటోలు



వాకలవలస నుంచి ఆటోల్లో బయలు దేరిన అభిమానులు

- సామాజిక సాధికార బస్సు యాత్రకు జన ప్రభంజనం
- ప్రజలతో కిక్కిరిసిన ఆమదాలవలస పట్టణం
- స్వాగతం పలికిన నియోజకవర్గ ప్రజలు, నాయకులు, అభిమానులు



బస్సులో వస్తున్న ప్రజాప్రతినిధులు



అభిమానం చాటుతున్న ఆమదాలవలసకు చెందిన శ్రీదుర్గా భవానీ టైలర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘం సభ్యులు

ఆమదాలవలస రూరల్/సరుబుజ్జిలి/ఆమదాలవలస/పొందూరు/బూర్జ: ఆమదాలవలస పట్టణంలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ సాధికార సామాజిక బస్సు యాత్రకు జనం ఉప్పెనలా తరలివచ్చారు. ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లోని అన్ని పంచాయతీలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారు. మహిళలు భారీ ఎత్తున బస్సు యాత్రలో పాల్గొన్నారు. యువత, రైతులు, అన్నివర్గాలకు చెందిన ప్రజలు ఉత్సాహంతో సభాస్థలికి చేరుకున్నారు. యువత గ్రామాల నుంచి ద్విచక్ర వాహనాల్లో ర్యాలీగా చేరుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని జంక్షన్ల వద్ద ఎదురుచూశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం నెలకొంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలంతా ఏకమయ్యారు. తమకు పదవులిచ్చి అధికారం కట్టబెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ జగన్నినాదాలతో ఆమదాలవలసలో గర్జించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ఆమదాలవలస గేటు వద్ద బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న మహిళలు, ప్రజలు



ఆటపాటలతో ఉత్సాహం నింపుతున్న వంగపండు ఉష



సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం నుంచి బయలు దేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



ఆమదాలవలస మండలంల కొత్తవలస గ్రామం నుంచి బస్సు యాత్రకు బయలుదేరిన ప్రజలు



పొందూరు మండలం లోలుగు నుంచి జెడ్పీటీసీ సభ్యుడు కాంతారావుతో కలిసి బయలు దేరిన అభిమానులు

జగన్‌తోనే ఉజ్వల భవిష్యత్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే బడుగు, బలహీన వర్గాలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. పేదరికం పోవాలంటే 2024లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలి. సామాన్యుడికి సైతం అత్యున్నత పదవులను కట్టబెట్టిన ఘనత జగన్‌దే. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నడుస్తున్నందుకు మనమంతా గర్వపడాలి.

– తమ్మినేని చిరంజీవినాగ్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

మహిళలకు పెద్దపీట



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తూ పదవులు కల్పించారు. స్థానిక సంస్థల్లోనూ ప్రత్యేక గుర్తింపునిచ్చారు. గతంలో ఏ రాజకీయ పార్టీ మహిళలకు ఇన్ని పదవులు ఇవ్వలేదు. మహిళా సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యం. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నారు.

– కిల్లి కృపారాణి, కేంద్ర మాజీ మంత్రి

ఆసరా ఆదుకుంది



ప్రభుత్వం అందించే ఆసరా నా కుటుంబాన్ని ఆదుకుంది. ఆసరా ద్వారా వచ్చిన డబ్బులతో సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నాం. అందుకే బస్సు యాత్రకు స్వతహాగా తరలివచ్చాను.

– పెద్ది నిర్మల, సరుబుజ్జిలి

రైతు భరోసాతో ప్రయోజనం



గతంలో పంటలు పండించేందుకు ప్రైవేటుగా అప్పులు తీసుకోవాల్సి వచ్చేది. సకాలంలో వడ్డీలు చెల్లించలేకపోతే ఇబ్బంది పెట్టేవారు. ఈ ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా పథకం ద్వారా నేరుగా రైతుల ఖాతాలకు నగదు జమచేసి ఆదుకుంటోంది. మళ్లీ జగనన్నే సీఎం కావాలి.

– కింజరాపు శ్రీనివాసరావు, పాతఆమదాలవలస

'చేయూత'లో లబ్ధి



చేయూత పథకంతో చాలా ప్రయోజనం ఉంది. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా మహిళల కోసం ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న ప్రత్యేక అభిమానంతో సభకు వచ్చాను.

– బోసెల లక్ష్మి, మర్రికొత్తవలస, ఆమదాలవలస

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

సారవకోట: అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగిందని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాయీబ్రాహ్మణులు, టైలర్లు, రజకులు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ చేదోడు పథకం ద్వారా నాయీబ్రాహ్మణులు, టైలర్లు, రజకులను ఈ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జమ్ము గంగులు, పార్టీ నాయకులు పల్లి కృష్ణారావు, శ్యామసుందరరావు, పారశెల్లి తేజేశ్వరరావు, నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు యలమంచి రామారావు, చిట్టిబాబు, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ పరిసరాల అభివృద్ధికి చర్యలు



ఎమ్మెల్యే కృష్ణదాస్‌తో మాట్లాడుతున్న సర్పంచ్, నాయకులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని సంత సమీపంలో పోలాకి రోడ్డుకు ఆనుకుని ఉన్న అసిరితల్లి అమ్మవారి ఆలయం నుంచి పాతపట్నం అమ్మవారి ఆలయం వరకు ఉన్న పరిసరాలను అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సముఖత వ్యక్తం చేశారు. స్థానిక ప్రాధాన్యతల మేరకు నిధులు సమీకరిద్దామని, అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు తీసుకువద్దామని హామీ ఇచ్చారు. సర్పంచ్ బూరల్లి శంకర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సాయి ప్రసాద్, నేతింటి రాజేశ్వరరావు, బీఎల్ శర్మ, చీపురు నారాయణ, ఠాగూర్, పెదిరెడ్ల రాము, డేవిడ్ తదితరులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రెండు అమ్మవారి ఆలయాల పరిసరాల్లో జంగిల్ తొలగించాలని, శ్మశాన వాటిక పరిసరాలను అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సమ్మతించి తగిన సూచనలు చేశారు.

సంక్షిప్తంగా..

పక్కాగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్రామన్

పాతపట్నం: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పలు పోలింగ్ బూత్‌లలో ఉండే ఒడిశాకు చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ రావాడ వెంకట్రామన్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆల్ పార్టీ, పోలింగ్ బూత్ సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు మండలాల్లో ఎక్కువగా ఒడిశా ఓటర్లు ఉంటారని, సూపర్‌వైజర్లు పక్కాగా పరిశీలించాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లినవారి పేర్లు, మృతి చెందినవారి పేర్లు తొలగించాలన్నారు. బోగస్ ఓట్లపై వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి, నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు. ఈ సమావేశంలో పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం తహసీల్దార్‌లు రవిచంద్ర, సరోజిని, చక్రవర్తి, మురళీమోహన్, ఎలక్షన్ డీటీ శైలజ, టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, సవిరిగాన ప్రదీప్, సూర్యం, డీటీలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ చేయండి

నరసన్నపేట: మండలంలో పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ల జాబితాలు ప్రదర్శించడం జరిగిందని, ఈ ఓటర్లు జాబితా స్వచ్ఛీకరణకు బీఎల్‌ఓలు బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్ ఎ.సింహాచలం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల టీడీ శరత్, సీనియర్ అసిస్టెంట్ లుకలాపు శ్రీను, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలను గుర్తించాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని 47 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న సాగునీటి చెరువుల ఆక్రమణలను గుర్తించాలని తహసీల్దార్ ఆర్.అప్పలరాజు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఉన్న సాగునీటి చెరువుల వాస్తవ పరిస్థితిని నివేదిక రూపంలో సమర్పించాలన్నారు. చెరువుల విస్తీర్ణం, సాగు భూమి, ఆక్రమణలు, ఆక్రమణ జరిగితే ఎంత వరకు ఆక్రమించుకున్నారు, కట్టడాలు, తదితర వివరాలను గుర్తించాలన్నారు. సాగునీటి చెరువులు ఆక్రమణలు జరగటం వల్ల ప్రస్తుతం పంటకు సాగునీరు అందివ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. చెరువుల ఆక్రమణల గుర్తింపు విషయమై నిర్లక్ష్యంగా ఉన్నా.. తప్పుడు నివేదికలు ఇచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉప తహసీల్దార్ రషీద్ అహ్మద్, ఆర్‌ఐ జి.గవరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జమ్ములో గడపగడపకు మన ప్రభుత్వం

నరసన్నపేట: మండలంలోని జమ్ము గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జమ్ము సర్పంచ్ వాన గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

రూ.13,500 ఆర్థికసాయం

పాతపట్నం: మేజర్ పంచాయతీ ఎస్సీ వీధికి చెందిన బెనియా నీలమణి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయారు. నీలమణి కుటుంబానికి ప్రదీప్ యువసేన హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో రూ.13,500 ఆర్థిక సహాయం, బియ్యం, నిత్యావసర సరుకులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ మంగళవారం అందించారు. బెనియా ఈశ్వరరావు, వంశీ, జి.రాము, సుధా, ఆఫీస్, పాల్గొనరావు, తిరుపతి, పాణిగ్రాహి, శిరిష్, ప్రదీప్ యువసేన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

కొత్తూరు: మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌ను డీఎస్‌ఓ వెంకటరావు మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. పెట్రోల్ నాణ్యత, కొలతలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫైర్ సేఫ్టీ పరికరాలను పరిశీలించారు. బంక్ వద్ద ఉండాల్సిన కనీస సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ స్టాక్, కొనుగోలు, అమ్మకం, పన్నుల చెల్లింపు, పని చేస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. పలువురు వాహనదారులతో మాట్లాడి పెట్రోల్ బంక్ వద్ద లభిస్తున్న సేవలపై ఆరా తీశారు. తహసీల్దార్ చక్రవర్తి, తూనికలు, కొలతల అధికారులు శంకర్, విశ్వేశ్వరరావు, వీఆర్వో రాము తదితరులు పాల్గొన్నారు.